andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 కనిష్ఠం 18.3
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 9 ఆగస్టు 2025



బీబీపేటలో వాహనాల తనిఖీ

దోమకొండ (బీబీపేట), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండల కేంద్రంలోని డాన్‌బంగ్లా వద్ద ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించి సరైనా పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

- సంప్రదాయ పద్ధతిలో పూజలు
- ఆలయాల్లో కుంకుమార్చనలు అభిషేకాలు
- లక్ష్మీ దేవికి నైవేద్యం సమర్పణ
- ఇరుగు పొరుగు వారికి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

8



మద్నూర్‌లో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

- పలు పాఠశాలల్లో రాఖీలు కట్టుకున్న విద్యార్థులు
- రాఖీలు, స్వీట్లను కొనుగోలు చేసిన మహిళలు
- సోదరుల వద్దకు బయలుదేరిన సోదరీమణులు
- నేడు రాఖీ పండుగ

సోదర ప్రేమకు ప్రతీక రక్షాబంధన్

8



మధ్యాహ్న భోజనం.. బకాయిల భారం

కామారెడ్డి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల ఆకలి తీర్చి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం భారంగా మారుతోంది. బిల్లుల చెల్లింపులో జాప్యం మూడు నెలలుగా పెండింగ్‌లో బకాయిలు, కొత్త మెనూ అమలుతో పెరిగిన ఖర్చులు వంట కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రోజుకు రూ.100 కూడా గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేక కొంత మంది కార్మికులు విధులకు దూరమవుతున్నారు. పరిస్థితి చేయిదాటిపోవడంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంటలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇక కొత్త మెనూ అమలుకు కలెక్టర్ వివిధ పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు.

- పెండింగ్‌లో మూడు నెలల మధ్యాహ్న భోజన బిల్లులు
- కొత్త మెనూతో పెరిగిన భారం
- అప్పులు చేయాల్సి వస్తుందని భోజన కార్మికుల ఆవేదన
- కొన్ని చోట్ల విధులకు దూరంగా కార్మికులు
- మరికొన్ని చోట్ల తప్పని పరిస్థితుల్లో వంట చేసి పెడుతున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో 1,122 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు.. 2,250 మంది కార్మికులు

జిల్లాలో 1,122 పాఠశాలలు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 1,122 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇం దులో ప్రాథమిక పాఠశాలలు 698, ప్రాథమికోన్నత పాఠశాలలు 124, ఉన్నత పాఠశాలలు 191, మోడల్ స్కూల్‌లు 6 ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 74,892 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ జిల్లా వ్యాప్తంగా 1,122 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 2,250 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.6.19 ప్రాథమికోన్నత విద్యార్థులకు రూ.9.29, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10.67 చొప్పున చెల్లిస్తారు. కోడిగుడ్డుకు రూ.6 చొప్పున చెల్లిస్తుండగా రోజు విడిచి రోజు విద్యార్థులకు భోజనంలో పెడుతున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60-40 శాతం చొప్పున నిధులను సమకూర్చుతాయి. 9,10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు చెల్లిస్తోంది. అయితే గత మూడు నెలల మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కార్మికులు అప్పులు చేసి వంటలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

కొత్త మెనూతో ఇబ్బందులు

2025-26 నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం కొత్త మెనూను అమలులోకి తీసుకు వచ్చింది. కొత్త మెనూ వల్ల మరింత నష్టపోవాల్సి వస్తుందని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరుగగా కొత్త మెనూ అమలుతో అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. మెనూ అమలుకు ధరలు కూడా ప్రభుత్వం పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

జిల్లాలో రూ.3కోట్ల వరకు బకాయిలు

జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏజెన్సీల ద్వారా మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీనికి గాను ఏజెన్సీలకు ప్రభుత్వం నెలనెల బిల్లులు చెల్లిస్తూ వస్తోంది. అయితే గత మూడు నెలలుగా మధ్యాహ్నభోజన నిర్వాహకులకు బిల్లులు నిలిచిపోయాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త మెనూ మరింత భారం అవుతోంది. బిల్లులు సకాలంలో రాక అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెట్టాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.1000, రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేలు కలిపి మొత్తం రూ.3వేల వరకు గౌరవ వేతనం ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు.

సరకులను ప్రభుత్వమే సరఫరా చేయాలి



• స్వరూప, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, చిన్నకొడప్‌గల్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం కింద ప్రతీ విద్యార్థికి రూ.25 ఇవ్వాలని లేక నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి. అప్పుడే నాణ్యమైన భోజనం అందుతోంది. ప్రతీనెల గ్రీన్ చానల్ ద్వారా, పీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు చెల్లించాలి.

రూ. మూడున్నర కోట్ల బిల్లులు రావాల్సి ఉంది



• చక్రపాణి, మధ్యాహ్న భోజన యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు మూడున్నర కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించక కార్మికులు అప్పులు చేయాల్సి వస్తోంది. వెంటనే ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలి. కార్మికులకు గౌరవ వేతనం ఇవ్వాలి. డ్రెస్‌కోడ్, గుర్తింపుకార్డులు ఇవ్వాలి.



ఉధృతంగా పారుతున్న సింగీతం మత్తడి

ఉప్పొంగుతున్న మత్తడి.. సింగీతంకు జలకళ

మహమ్మద్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటుగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి సింగీతం రిజర్వాయర్‌కు పెద్దఎత్తున నీరువచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. దీంతో సింగీతం జలాశయం మత్తడి పారుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలకు సరిపడా నీరు సింగీతంలోకి రావడంతో 450 ఎకరాలకు నీటికి ఇబ్బందులు తొలగిపోయాయని, ఆయకట్టు కింది బూర్గుల్, గున్కుల్, మహమ్మద్‌నగర్, నర్వ గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మత్తడి పారుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున మత్తడి వద్దకు చేరుకుని సెల్ఫీలు తీసుకుంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతుంది.



కలశాలను ఊరేగిస్తున్న మున్నూరుకాపు సంఘ సభ్యులు

కలశాలతో మున్నూరుకాపుల ఊరేగింపు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వీక్లి మార్కెట్‌లో రాజరాజేశ్వరీ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా గురువారం మున్నూరుకాపులు కలశాల ఊరేగింపు చేపట్టారు. హనుమాన్ దేవాలయం నుంచి ర్యాలీగా స్టేషన్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు నుంచి తిరిగి ఆలయానికి చేరుకుని అమ్మవారికి కలశాలను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ముదాం శ్రీనివాస్,బొజ్జ రవి, మామిండ్ల వేణు, ముదాం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు

బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్‌ది అనవసర రాద్ధాంతం

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ అనవసరపు రాద్ధాంతం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు డ్రామాలు చేస్తుందని అన్నారు. ముస్లింలను బీసీలలో కలపకుండా రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభిస్తే బీజేపీ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న విషయం కేంద్ర మంత్రులు వివరించినప్పటికీ రిజర్వేషన్‌లను బీజేపీ అమలు చేయడం లేదని ఢిల్లీలో దొంగ దీక్షలు చేపడుతుందని అన్నారు. ఇకనైన బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం కాకుండా ముస్లింలను బీసీ కోటా నుంచి తప్పించాలని అన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

• విద్యుత్ శాఖ డీఈ ప్రభాకర్‌రావు

బీర్కూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ డీఈ ప్రభాకర్‌రావు, ఏడీ సంజీవరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందన్నారు. బీర్కూర్, బాన్సువాడ టౌన్, బాన్సువాడ రూరల్, నస్రుల్లాబాద్ మండలాల వినియోగదారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

రామారెడ్డి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం రంగంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు దర్ని సుమలత ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సక్రమంగా నిర్వహించాలని పలు సలహాలు, సూచనలను ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లర్స్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయినందున మిగతా నిర్మాణం కూడా వేగవంతం చేయాలని లబ్ధిదారుకు సూచించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి ఎక్కడా కూడా ఇసుక, మొరం సమస్య లేకుండా ప్రభుత్వం సూచించిన విధంగా నాణ్యతగా ఇళ్లను నిర్మించుకొని త్వరగా గృహ ప్రవేశాలు చేయాలని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇసుక, మొరం తెచ్చుకోవడానికి ఎంపీడీవోతో రాయించుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించడానికి డబ్బులు ఇబ్బందిగా ఉన్న నిరుపేద లబ్ధిదారులకు ఐకెపి ద్వారా ముందస్తు రుణం అందించాలని లబ్ధిదారులు ఐకెపి గ్రూపులో లేకపోతే గ్రూపులో చేర్పి మరీ రుణాలను అందించాలని ఎంపీడీవో నాగేశ్వర్ ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా జరిగేలా ఎంపీడీవోను పంచాయతీ కార్యదర్శులు కలిసి ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ జైపాల్ రెడ్డి, డిఇఇ సుభాష్, ఏఈ సుచిత్రలను ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించి తొందరగా పూర్తి చేయగలరని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ భాస్కరన్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఎంపిఓ ఏలేటి తిరుపతిరెడ్డి, ఎస్సై లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికాంత్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, మాజీ సర్పంచ్ విజయ్ సింగ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మహేష్, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అబ్దుల్ రెహమాన్ ఠాగూర్ సురేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి



రైతు వేదికలో సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డీఏవో

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో డీఏవో మోహన్‌రెడ్డి పర్యటించారు. రైతులు పంటల సస్యరక్షణ కోసం వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రైతువేదిక, గ్రామ పంచాయతీ కార్యాలయం, శానిటేషన్ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవేంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా పండరినాథ్



పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా పండరినాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పశువైద్యాధికారిగా పని చేస్తున్న మణికుమార్ పశుపోషకులకు అందుబాటులో ఉండకపోవడంతో గురువారం ఆసుపత్రి ఎదుట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పశుపోషకులు ధర్నా నిర్వహించారు. దీంతో జిల్లా అధికారులు జుక్కల్ పశువైద్యాధికారిగా పనిచేస్తున్న పండరినాథ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా గతంలో ఇక్కడ అటెండర్‌గా పనిచేసిన సురేష్‌ను తిరిగి డిప్యూటేషన్‌పై నియమించారు.



దోమకొండలో వర్షం కురుస్తున్న దృశ్యం

దోమకొండలో మోస్తరు వర్షం

దోమకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సుమారు గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. గత కొన్ని రోజుల నుంచి మండలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేసిన వరి పంట ఎండిపోయే దశకు చేరాయి. ఉదయం కురిసిన వర్షంతో పంట పొలాల్లో నీరు నిలవడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



స్టేడియం కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

క్రీడా మైదానానికి స్థలం కేటాయింపు

గాంధారి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో క్రీడా మైదనం కోసం గత కొన్ని రోజులుగా యువకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు విన్నవించగా 546 సర్వే నెంబర్‌లో ఐదు ఎకరాల స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయిస్తూ శుక్రవారం జీవో కాపీని విడుదల చేశారు. క్రీడా మైదానంకు స్థలం కేటాయించినందుకు మాజీ ఎంపీటీసీ రాజులు, మాజీ సర్పంచ్ సంజీవ్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రుద్రూర్ ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రుద్రూరు,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఐఎల్ఆర్ గది, ల్యాబ్ లేటరీగది, స్త్రీవార్డు, మెయిన్ డ్రగ్ స్టోర్, ప్రసూతి గదులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని పలురికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.సబ్‌కలెక్టర్ వెంట వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్ధిఖ, సూపర్‌వైజర్‌రవి,ల్యాబ్ టెక్నీషియన్ తరుణ్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

మైక్రో ఫైనాన్స్‌ల దౌర్జన్యాలను అరికట్టాలి

బోధన్: బోధన్‌తో పాటు పరిసరా ప్రాంతాలలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మైక్రో ఫైనాన్స్‌ల దౌర్జన్యంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్‌కు సీపీఐ(ఎంఎల్) బోధన్ డివిజన్ కార్యదర్శి వరదయ్యతో పాటు పలువురు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) బోధన్ డివిజన్ కార్యదర్శి వరదయ్య మాట్లాడుతూ ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయాగౌడ్ అనే వ్యక్తి బైక్ దౌర్జన్యంగా తీసుకెళ్లిన మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువులు అందుబాటులో ఉన్నాయి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్



నాగేపూర్‌లో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్

నవీపేట,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):జిల్లాలో యూరియాతో పాటు అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్ అన్నారు.శుక్రవారం మండలంలోని నాగేపూర్ సొసైటీ ఎరువుల గోదామును ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎరువుల స్టాక్ రిజిష్టర్, ఈపాస్ మిషన్‌ను పరిశీలించారు.ఎరువులధరలు, నిల్వలు రైతులకు కనపడే విధంగా బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువుల డిమాండ్‌ను అనుసరించి ముందే ఇండెంట్ సమర్పించి రైతుల అవసరాలకు అనుగుణంగాఎరువులను నిల్వ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎరువుల సరఫరా ఈపాస్‌మిషన్ ద్వారా రైతులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్, సొసైటీ సేల్స్‌మెన్ రఫీ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పేకాట స్థావరంపై దాడి

● ఏడుగురు అరెస్టు ● రూ.8,470ల నగదు స్వాధీనం

రెంజల్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ గ్రామ శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.8470ల నగదును స్వాధీనం చేసుకోన్నారని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా రహస్యంగా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు. మండలంలో ఎక్కడైన పేకాట ఆడినట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పిట్లం:మండలకేంద్రంలో అర్థరాత్రి సమయంలో ఓఇంట్లో పేకాట ఆడుతున్న స్థావరంపైదాడి చేశామని ఎస్సైరాజు అన్నారు.ఎస్సై శుక్రవారం మాట్లాడుతూ పేకాటను సహించేది లేదని మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే పోలీసుస్టేషన్ సెల్‌నంబర్ 8712686171 సమాచారం అందిం చాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.అర్ధరాత్రి పిట్లంలో పేకాటలో 7గురిని పట్టుకొని, వారివద్ద రూ.4320 ఏడు సెల్ ఫోన్ లు, ఒక కారు, రెండుద్విచక్రవాహనాలు స్వాధీనం పరుచుకొని వారందరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి



స్వామి(ఫైల్)

రెంజల్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు వీరన్నగుట్ట గ్రామానికి చెందిన కొత్తూరు స్వామి(47) మృతి చెందాడు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన మలిదశ ఉద్యమకారుడి మృతి బాధకరమని మండల సీనియర్ నాయకులు కాశం సాయిలు అన్నారు. తెలంగాణ ఉద్యమమే ఊపిరిగా కేసీఆర్ సారథ్యంలో ఉద్యమ నాయకత్వంలో పాల్గొని కష్టపడి పని చేసిన కార్యకర్త కొత్తూరు స్వామి అన్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తోడుగా ఉంటుందని అన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



మోర్తాడ్‌లో నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ

మోర్తాడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్కల్ గ్రామంలో గత నెలలో జరిగిన హత్యకేసులో నిందితుడిని అరెస్టు చేశామని భీమ్‌గల్ సీఐపొన్నం సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కేసు వివరాలను ఆయన విలేకరులకు వివరించారు. గతనెల 26న దొన్కల్‌లో వడ్డెర కాలనీకి చెందిన ఒల్లెపు నాగరాజు అతడి వద్ద పనిచేసే షేక్‌రహమాన్ ఇద్దరు మద్యం తాగుతూ..డబ్బుల విషయంలో గొడవజరిగిందని సీఐ తెలిపారు. ఆ సమయంలో ఒల్లెపు నాగరాజు షేక్‌రహమాన్‌ను కర్రతో దాడిచేసి పారిపోయినాడని ఈ దాడిలో షేక్‌రహమాన్ గాయాలతో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడని తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు మోర్తాడ్ ఎస్సై రాము సిబ్బందితో కలిసి మోర్తాడ్ రైల్వే స్టేషన్ దగ్గర నిందితుడు నాగరాజును అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇందలవాయి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రూప్ల నాయక్ తండాకు చెందిన బాలాజీ (50)గుర్తు తెలియని ఢీకొట్టడంతో అక్కడి కక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున రూప్లతండా నుంచి దేవితండాకు 44జాతీయ రహదారి బాలాజీ నడుచుకుంటూ వెళ్తుండగా అతివేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాల పాలైన బాలాజీ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కొడుకు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంథనిలో మార్కెట్ యార్డ్ గోదాం స్థల పరిశీలన

ఆర్మూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం మగ్గిడిగ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మార్కెట్ యాడ్ గోదాం స్థలాన్ని ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు.గతంలో గ్రామ స్థులు మార్కెట్ యాడ్‌కు స్థలాన్ని రిజిష్టర్ చేయించి గోదాం నిర్మించాలని కోరారు. పనులు మధ్యలోనే నిలిచిపో యాయి. గ్రామస్థులతో చర్చించిన వినయ్‌రెడ్డి గ్రామ స్థులు ఏకగ్రీవంగా తీర్మాణం చేస్తే తాను నిధుల మంజూ రుకు కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఇస్సాపల్లిజీవన్,నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మచ్చర్లలో లిఫ్టు పనుల పరిశీలన

అదే విధంగా మచ్చర్ల గ్రామంలో కొనసాగుతున్న ఎత్తిపోతల పథకం పనులను వినయ్‌రెడ్డి పరిశీలించారు. పోచంపాడ్ బ్యాక్ వాటర్ లిఫ్టు పనులు పూర్తయితే మచ్చర్ల, కుద్వాన్‌పూర్ గ్రామ రైతులకు సుమారు 2850 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.ఆయనవెంట ఆలూర్, నందిపేట మండలాల అధ్యక్షుడు ముక్కెర విజయ్, మంద మహిపాల్,సిరుపురంభోజారెడ్డి,జితేందర్‌లు ఉన్నారు.



మంథనిలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఆర్మూర్:ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని ఎస్ఎస్‌కే భవన్‌లో క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు.ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఖాందేష్ సుదర్శన్, కార్యదర్శిగా అల్జాపూర్ రాజేశ్, కోశా ధికారిగా సాత్‌పుతే శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షత్రియ సమాజ్ సభ్యులుఅనేకసేవా కార్యక్రమాలు నిర్వహిస్తూఇతరుల కు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికిరూ. 20లక్షల నిధులుమంజూరు చేయిస్తానని హామీఇచ్చా రు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, క్షత్రియసమాజ్ రాష్ట్రకార్యనిర్వహణ కార్యదర్శి ఖాం దేష్ శ్రీనివాస్, కార్యదర్శిగణేష్, ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు బచ్చేవాల్‌రెడ్డి ప్రకాష్, క్షత్రియ ప్రాం తీయ సమాజ్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఖాందేష్ సంగీత, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ఆర్మూర్ నియోజక వర్గంలోని వెల్మల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని పీఆర్ భవన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఉమ్మెడ మహేష్, మహేందర్, రజనీ కాంత్, నవీన్, సాయిలు, మోహన్‌తో పాటు పలువు రు కార్యకర్తలు పార్టీలో చేరిగా కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నందిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు గోపి, సిద్ద గంగారాం, మాసీ ఎంపీటీసీ గాదరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా డంప్ చేస్తే చర్యలు తప్పవు



కల్లూర్ ఎక్స్ రోడ్డులో డంప్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తున్న దృశ్యం

కోటగిరి,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను తీసుకుని అక్రమంగా డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గంగాధర్ హెచ్చరించారు. పోతంగల్ మండలంలోని కల్లూర్ ఎక్స్ రోడ్డులో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసి ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగాధర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అనుమతులను పొంది అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్నామన్నారు. సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు కేటాయిస్తున్నామని తెలిపారు. ఇసుకను అక్రమంగా డంప్ చేసిన వారిపై నిఘా పెట్టి మరోమారు ఇసుక రవాణాకు అనుమతించమని ఆయన స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక

ఏర్గట్ల: మండలంలోని తడపాకల్ గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న వారికి ఉచితంగా అందించామని మండల తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. శుక్రవారం గ్రామంలోని డంప్ చేసిన ఇసుకను ఇందిరమ్మ కమిటీ సభ్యులకు రెవెన్యూ అధికారులు అప్పజెప్పారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారి వెంకటేష్, కార్యదర్శి రాకేష్, ఇంది రమ్మ కమిటీ సభ్యులు లోలపురాజు, బడిగిరి శ్రీనివాస్, అట్ల శ్రీనివాస్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి బ్రిడ్జిపై ఇనుప జాలీల ఏర్పాటును పరిశీలించాలి

నవీపేట,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):మండలంలోని యంచ గోదావరి రోడ్డు బ్రిడ్జికి ఇరువైపులా ఇనుప జాలిల ఏర్పాటును పరిశీలించాలని సీఎం కార్యాలయం నుంచి జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చాయని గ్రామస్థులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా చాలా మంది యంచ గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానిక యువకులు గస్తీ దళాలు ఏర్పాటు చేసుకుని నదిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వందలాది మందిని ఇప్పటి వరకు కాపాడడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈవిషయంపై తాము గతనెల 2న సీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేయగా ఇటీవల సీఎం కార్యాలయం నుంచి జిల్లా ఉన్నతాధికారులకు తగినచర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈవిషయంపై తమకు సీఎంవో కార్యాలయం నుంచి సమాచారం వచ్చిందని గ్రామస్థులు వివరించారు.

బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా రాజు బాధ్యతలు

బోధన్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా రాజు బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తాను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బోధన్ మున్సిపాలిటీ ఫుల్ అడిషనల్‌చార్జి కమిషనర్‌గా నియమించారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో తాను శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోను మర్యాద పూర్వకంగా కలిసి బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణ అభివృద్దే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

భూభారతి సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారం

బోధన్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని గ్రామ చావిడి వద్ద శుక్రవారం తహసీల్దార్ విఠల్ భూభారతి రెవెన్యూ సదస్సు దరఖాస్తులను పరిశీలించారు. భూభారతి సదస్సు ద్వారా వచ్చిన దరఖాస్తులపై ప్రజలను పిలిపించి సమస్యల పరిష్కారానికి పూనుకున్నారు. పాండు తర్ఫా కింద దరఖాస్తు చేసిన పలువురు గ్రామస్థులు హజరయ్యారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇచ్చారు. భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా మారుతున్నాయి. ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కార దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. ఆయన వెంట ఆర్ఐ గంగాధర్, సిబ్బంది తదితరులున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రుద్రూరు,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలం రాణంపల్లి గ్రామంలో గురువారం రాత్రి పేకాట స్థావరంపై రుద్రూర్ పోలీస్‌లు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 4,510రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో వరి పంటను పరిశీలించిన ఏవో

మోర్తాడ్ , ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు కాండం తొలుచు పురుగు, తాటాకు తెగులు, ఈగ ఉధృతి తీవ్రంగా ఉందని రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి హరీష్ కుమార్ అన్నారు. శుక్రవారం మోర్తాడ్‌లోని బద్దం వాడ రైతులకు చెందిన వరి పం టను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ వరి నాటి 30 రోజులైన పొలాల్లో రోగా లు సోకినాయని సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. నష్టం తీవ్రత తక్కువగా ఉండి మంచిపంటను సాధించడం కోసం రైతులు ఖాండం తొలిచి పురుగు సోకితే కార్బోఫ్యూ రాన్ 3జీ పది కిలోలు ఎకరాకు, తాటాకు తెగులుకు క్లొరైసిరిపోర్ 320 మిల్లీ లీటర్లు ఎకరాకు వాడు కోవాలని చెప్పారు. ఈ క్షేత్ర పరిశీలనలో మండల వ్యవసా యాధికారి హరీష్ కుమార్ తో పాటు ఏఎంసీ డైరెక్టర్ మహిపాల్, రాజ్‌భరత్, వెంకట్ పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో హరీష్‌కుమార్

నగరంలోని సాయిబాబా ఆలయంలో చోరీ

▸▸ వెండి కిరీటం, విగ్రహం అపహరణ



ఆలయం వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):నగరంలోని 17వ డివిజన్ రాజీవ్‌నగర్ హనుమాన్ అలయ సమీపంలోని సాయిబాబా ఆలయంలో దొంగతనం జరిగింది. గురువారం రాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి సుమారు 30 తులాల వెండి కిరీటం, 4కిలోల ఇత్తడి సాయిబాబా విగ్రహం దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం భక్తులు వెళ్లే సరికి ఆలయ ద్వారం తాళం కిందపడి ఉండటాన్ని గమనించి స్థానికులు 3వటౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. విగ్రహంతో పాటు రాగి చెంబులు, మంగళహారతులు, మరికొన్ని విలువైన సామగ్రిని కూడా అపహరించారని స్థానికులు తెలిపారు. పోలీసులు నిందితులను గుర్తించేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ఏర్గట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీసీలను మభ్య పెట్టకుండా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్ర నాయకులు రిజర్వేషన్ విషయంలో ఏదో గుడ్డి సాకు చూపించి, ఆటంకం కలిగించి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారని, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో కులాలకు సమాన వాటా ప్రకారం అవకాశాలు కల్పిస్తున్నట్లే పక్కన ఉన్న తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు సాధించుకుని అమలులో ఉన్నట్లే తెలంగాణాలో కూడా బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు.గతబీఆర్ఎస్ ప్రభుత్వం 34శాతం ఉన్న బీసీ రిజర్వే షన్‌ను 22 శాతంకు తగ్గించి ఇప్పుడు బీసీ గర్జన పేరుతో నాటకాలు ఆడుతున్నారని, బీసీలకు క్షమాపణ చెప్పి రిజర్వేషన్ కల్పించేందుకు ముందు రావాలన్నారు. విద్య, ఉపాధికోసం ఢిల్లీలో జంతర్ మంతర్ మహాధర్నాలో జిల్లాతో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నామని, 42 శాతం రిజర్వేషన్ సాధించడానికి కులమతాలకు అతీతంగా ఒక్కటై కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రిజర్వేషన్ సాధాన కోసం ముందుకుసాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, ఓర్సు రాములు, రేండ్ల రాజారెడ్డి, రాజారం సహదేవ్, మునిమాణిక్యం అజయ్, దండెవోయిన సాయికుమార్, మేకల సాయన్న, జుంగల గణేష్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో మ్యాట్ల పంపిణీ

రుద్రూరు,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు మనసున్న మహానేత సురేష్‌కుమార్ షెట్కార్ జన్మదిన వేడుకలను రుద్రూర్ మండల కేంద్రంలోని 8వ అంగన్‌వాడీ సెంటర్‌లో బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సురేష్ కుమార్ షెట్కార్ జన్మదినాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ సెంటర్‌లలో రెండు ఫ్లోర్ మ్యాట్లు, స్నాక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పోతురాజు లింగం, షేక్ నిసార్, వడ్ల నరేష్, గాండ్ల శ్రీనివాస్, రఫీక్, డాక్టర్ శివ, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రెంజల్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన ఉద్యమకారుడు కొత్తూరు స్వామి శుక్రవారం ఉదయం మృతి చెందగా ఆయన కుటుంబానికి మండల బీఆర్ఎస్ నాయకులు అంత్యక్రియలకు హాజరై రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల సీనియర్ నాయకులు కాశం సాయిలు, మండల అధ్యక్షుడు భూంరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అనేక పోరాటాలు చేసిన వ్యక్తి కొత్తూరు స్వామి అని ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారి కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైండ్ల రాజు, నీలా సొసైటీ చైర్మన్ ఇమామ్ బేగ్, సీనియర్ నాయకులు రఫీక్, మౌలానా, భూమేష్, రాము, కుమార్, అసద్ తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్ కళాశాలకు డ్యూయేల్ డెస్క్‌ల పంపిణీ

నందిపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు 20 డ్యూయల్ డెస్క్ బెంచీలను శుక్రవారం అందజేశారు. కలాశాలలో విద్యార్థిని విద్యార్థులకు సౌకర్యా లను కల్పించాలన్న ఉద్దేశంతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సిద్ధపురం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 20 డ్యూయల్ డెస్క్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డెస్క్ బెంచీల దాతలు సిద్ధాపురం లక్ష్మీనారాయణ, రంజీత్, బ్యాంక్ రవి, అవదూత మధు, రుమ్మ సంజీవ్, మగ్దుమ్ పాషా, నరహరి, దమ్మారెడ్డి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బాన్సువాడ రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని పులి కుచ్చ తండా గ్రామానికి చెందిన జప్పిబాయి(65) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడతూ ఈ నెల 7న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైనా చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసలు తెలిపారు.

పట్టణంలో ఫ్రైడే డ్రైడే



నీటి నిల్వలను పరిశీలిస్తున్న సిబ్బంది

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో యూపీహెచ్‌సీ సిబ్బంది మున్సిపల్ ఆధ్వర్యంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతీ ఇంటింటికి తిరుగుతూ నీటి నిల్వలను పరిశీలించి నిల్వఉన్న నీటిని తొలగించారు. సీజనల్ వ్యాధుల పట్ల పరిసరా ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూరమౌళి, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు,సానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు,ఏఎన్ఎం కమల,యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోనిబాబాపూర్‌లో శుక్రవారం పోలీసు శాఖఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్,డ్రగ్స్‌మత్తు పదార్థాల నియంత్రణపై ప్రజలకుఅవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు ఈఅవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.యువత మత్తుకు బానిస కావొద్దని అలాగే డ్రగ్స్‌గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మితే పోలీసు శాఖ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1908కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లుగోప్యంగా ఉంచుతామని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీనెంబర్లు అడిగితే ఇవ్వొదనిఅన్నారు.ఈ కార్యక్రమంలో అంజుమాన్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు,యువకులు, పోలీస్‌శాఖ సిబ్బంది గంగాధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఇంటింటికీ బీజేపీ

మాక్లూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్నటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థులకు స్వయం సహాయక గ్రూపు సభ్యులను, గ్రామ పెద్దలను కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో రవి, హన్మంతు, బాలరాజు, సాయికుమార్, పాల్గొన్నారు.

జిల్లాలో వీడీసీలను రద్దు చేయాలి

వేల్పూర్,ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రోజురోజుకు వీడీసీల ఆగడాలు పెరుగిపోతున్నాయని వాటిని తక్షణమే రద్దుచేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారంవారు వేల్పూర్‌లో విలేకరులతోమాట్లాడారు.గురువారం ఆర్మూర్ మండలం సుర్భిర్యాల్‌లో మాదిగదళిత సంఘాలను ఆగ్రామవీడీసీ సభ్యులు బహిష్కరించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ పాల్‌రాజ్, ప్రధానకార్యదర్శి జాంబవ చామర్, సలహాదారుడు నారాయణ, తదితరులున్నారు.

బెంగాలీ గోల్డ్ వర్కర్ పరారీ

● సుమారు 18 తులాలు తీసుకొని వెళ్లిన వర్కర్

ఆర్మూర్‌టౌన్ , ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని హుస్నాబాద్ గల్లీలో పశ్చిమబెంగాల్ రాష్టానికి చెందిన భూపాల్ అనే వ్యక్తి సుమారు 18 తులాల బంగారంతో ఉడాయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.వివరాలు ఇలాఉన్నాయి. గత కొన్నేళ్ల క్రితం హుస్నాబాద్ కాలనీలో ఇళ్లు అద్దెకు తీసుకుని బంగారు నగలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని కొందరు బంగారం దుకాణాలకు చెందిన వారు, పట్టణ ప్రజలు తమ బంగారాన్ని నగలు తయారు చేయడానికి ఇస్తుంటారు. దీంతో ఆయనపై నమ్మకం కుదిరిన పలువురు నగలు చేయించుకుంటూ వస్తున్నారు. ఇలా ఉండగా గత మూడు రోజుల క్రితం నుంచి భూపాల్ ఆచూకీ తెలియక పోవడం ఇళ్లకు తాళం వేసి కుటుంబ సభ్యులతో సహ వెళ్లిపో వడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేసి ఫోన్‌లు చేయగా మూడు రోజు లుగా ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో నలుగురు బాధితులు వర్కర్ భూపాల్‌పై శుక్రవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధి తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

బోధన్ పోస్టాఫీస్ వద్ద బారులు తీరిన మహిళలు

బోధన్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రధాన పోస్టాఫీస్ వద్ద శుక్రవారం మహిళలు భారీగా గుమిగూడారు. మహలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 వస్తాయని తప్పుడు ప్రచారం జరగడంతో పోస్టల్ ఖాతాలు తెరిచేందుకు మహిళలు పోస్టల్ కార్యాలయానికి చేరుకుని బారులు తీరారు. అధికారులు చెప్పిన వినకుండా మహిళలు పోస్టల్ ఖాతాలు తెరిచారు. ఖాతాలే కావాలంటూ మహిళలు కోరారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ వద్ద మహిళలు భారీగా గుమిగూడారు. మహలక్ష్మి పథకం తప్పుడు ప్రచారంతోనే మహిళలు పోస్టాఫీస్‌కు తరలివచ్చారు.

డిగ్రీ, పీజీ కళాశాలలను యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న డిగ్రీ, పీజీ కళాశాలలను తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోకి తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు సర్టిఫికెట్లు, ఇతర అవసరాల కోసం కాకతీయ యూనివర్సిటీకి వెళ్లవల్సి వస్తుందని అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజులను తగ్గించాలని, ఫైనాన్స్ కోర్సులను రెగ్యూలర్ చేయాలని, ఫీజురీయంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్, దేవిక, రాకేష్, లహరి, రాజేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల హాస్టల్ డిపాజిట్లు తగ్గించాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్ విద్యార్థుల ఫీజుల డిపాజిట్లు పూర్తిగా తగ్గించాలని ఇట్టి డిపాజిట్ల వల్ల పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు ఈ విషయంలో చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, భూషణ్, నాగేంద్ర, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండుగ సందర్భంగా బస్టాండ్ వద్ద ప్రయాణికుల సందడి

● బస్సులో సీట్ల కోసం ఎగబడ్డ ప్రయాణికులు


బస్సు ఎక్కడానికి గుమిగూడిన ప్రయాణికులు

సుభాష్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ, రెండు రోజుల సెలవు దినాలు రావడంతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న అందరూ స్వగ్రామానికి చేరేందుకు క్యూలు కట్టారు. రాఖీ పండుగ సందడి శుక్రవారమే మొదలైంది. ఉదయం నుంచి నగరంలోని ప్రధాన బస్టాండ్‌తో పాటు మండలాల బస్టాండ్‌లు బస్సుల కోసం ప్రయాణికులు బారులు తీరారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది ప్రయాణికులు ఒక్కసారిగా బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూశారు. సీట్ల కోసం ప్రయాణికులు పాట్లు పడ్డారు. బస్సులు రాగానే సీట్ల కోసం ప్రయాణికులు కిటికీల దగ్గరకు వెళ్లి సీట్లను ఆపుకున్నారు. బస్సులు మొత్తం కిక్కిరిసి ప్రయాణించాయి. 50 నుంచి 60 మంది ప్రయాణించాల్సిన బస్సులలో 100 మందికి పైగా ప్రయాణికులు ప్రయాణించారు. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు నిజామాబాద్‌కు చేరుకొని వారి స్వగృహాలకు చేరుకోనున్నారు. సాయంత్రం వేళలో నగర బస్టాండ్ ప్రాంగణం మరింత ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.


నవీపేటలో వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం


పెగడాపల్లి మహలక్ష్మి ఆలయంలో కుంకుమార్చన దృశ్యం


వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

▸▸ ఆలయాల్లో సామూహిక పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సకల శుభాలను అందించు పది కాలాల పాటు పసుపు కుంకుమలతో మమ్మల్ని చూడు తల్లి అని వేడుకుంటూ వైభవంగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాస పౌర్ణమికి ముందు వచ్చే వరలక్ష్మి వ్రతం రోజున అమ్మవారిని పూజించడం వల్ల సకల శుభాలు చేకూరుతాయని శాస్త్రాలు చెప్పడంతో మహిళలు ఆలయాల్లో, ఇళ్లల్లో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మి పర్వదినాన్ని పురస్కరించుకొని అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించగా మరికొన్ని ఆలయాల్లో దుర్గ సప్తశతితో హోమాలు చేశారు. వరలక్ష్మి వ్రతం నిర్వహించిన మహిళలు ముత్తయిదువలకు వాయినాలు ఇచ్చి పది కాలాల పాటు పసుపు కుంకుమలతో చల్లగా ఉండే విధంగా ఆశీస్సులు అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్‌లో గల వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదం అందించారు. నీలకంఠేశ్వర ఆలయంలోని పార్వతి ఆలయం, దుబ్బ మహాలక్ష్మి దేవాలయం, రైల్వేకమాన్ వద్దగల సంతోషిమాత ఆలయం, హమాల్‌వాడి సంతోషి సాయి ఆలయం, ముబారక్‌నగర్ పెద్దమ్మ దేవాలయం, పాత కలెక్టరేట్ వద్దగల నవదుర్గాలయం, వినాయక్‌నగర్ దుర్గామాత ఆలయం, భవానినగర్‌లోని తుల్జాభవాని ఆలయం, తదితర ఆలయాల్లో ఘనంగా వరలక్ష్మి వ్రతాలు సాగాయి.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మి వ్రతం శుక్రవారంగా భావించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఆశించి ఈ వ్రత విధానాన్ని అనుసరించి పూజలు నిర్వహించారు.


వరలక్ష్మి పూజలు చేస్తున్న మహిళలు

నవీపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం శుక్ల పక్షమి పౌర్ణమి ముందురోజు వచ్చే శుక్రవారం రోజున ఈ వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తుంటారు. మహిళలు తమకు అష్టఐశ్వరాలు అందించాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ముత్తైదువులను తమ ఇళ్లకు ఆహ్వానించి వాయినాలు సమర్పించి ఆశీర్వదం తీసుకున్నారు.

బోధన్‌లో సహస్ర కుంకుమార్చనలు

బోధన్: పట్టణంతో పాటు మండలంలోని పలు అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు, సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా ఆలయాల్లో కుంకుమార్చనలో పాల్గొన్నారు. పలువురు తమ ఇళ్లలోనే వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మహిళలకు అయినాలు సమర్పించి మంగళ గౌరీ వ్రతాలు నిర్వహించుకున్నారు. మండలంలోని పెగడాపల్లి మహలక్ష్మి ఆలయంలో సహస్ర కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో శ్రావణ మాసం శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మహిళలు వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ప్రతీ ఇంట్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని బంగారు, వెండి ఆభరణలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలతో వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం తోటి మహిళలకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలోని దూలగుట్ట వద్ద ఉన్న శుక్రవారం దేవి మందిరంలో అమ్మవారికి ప్రత్యేక ప్రజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డిచ్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సుహాసినులు వరలక్ష్మి వ్రతాలను వైభవోపేతంగా నిర్వహించుకున్నారు. వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం వల్ల పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు సుహాసినిలు పేర్కొన్నారు. వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించడం వల్ల సుహాసినిలకు అనుకున్న ఫలాలు సిద్ధిస్తాయని మహిళలు పేర్కొన్నారు.

ఎడపల్లి: మండలంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా భావించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఆశించి ఈ వ్రత విధానాన్ని అనుసరించి పూజలు నిర్వహించారు.

నల్లపోచమ్మ దేవాలయంలో..


అమ్మవారు


కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

నిజామాబాద్ కల్చరల్: నగరంలోని పాములబస్తీలో కొలువుదీరిన నల్లపోచమ్మ దేవాలయంలో వరలక్ష్మి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు మాకునూరి రమణాచార్యులు వేద మంత్రాలతో అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలతో పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి నామాలు, చండీసప్తశతి మంత్రాలతో చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుడి పోచయ్య, కందుల లక్ష్మి, రాజశేఖర్, విమలేశ్వరి, కవిత, వెంకటేశ్, అనిత, ఎర్రోళ్ల నర్సయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.


అన్నదానం


వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు


మోతే విజ్ఞాన్ పాఠశాలలో రక్షాబంధన్ నిర్వహిస్తున్న దృశ్యం


రాఖీ అక్షర రూపంలో కమ్మర్‌పల్లి కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు


రక్షాబంధన్‌లో చిన్నారులు

పలు పాఠశాలల్లో ఘనంగా రక్షాబంధన్

వేల్పూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతే గ్రామంలో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హరీష్ మాట్లాడుతూ రక్షాబంధన్ విశిష్ఠత గురించి విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో..

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్ష బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని ఆనందంగా గడిపారు. పాఠశాల ఉపాధ్యాయులు రాఖీ పౌర్ణిమ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు రాఖీ అరక్షరూపంలో కూర్చొని అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిలుక గంగా ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కుందార సచిన్, ఉపాధ్యాయులు మనోజ్ఞ, రమ్య, కిరణ్, ప్రవళిక, నిఖిత పాల్గొన్నారు. కాగా మండలంలోని పలు విద్యాలయాల్లో రక్షాబంధన్ కార్యక్రవన్ని విద్యార్థులు ఘనంగ జరుపుకున్నారు.

సందడిగా రాఖీ పండుగ

మోస్రా: చందూర్ మండల కేంద్రంలోని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష మనం అందరం దేశానికి రక్ష నినాదంతో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రియాంక, స్వప్న, అకాడమీక్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, ఉదయశ్రీ, నిశిత, సంధ్య, జయశ్రీ, సులక్షణ, హారిక, లలిత పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో రక్షా బంధన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు విద్యార్థిని విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అనుబంధానికి ప్రతీక..

▸▸ జోరుగా రాఖీల అమ్మకాలు ▸▸ నేడు రాఖీ పర్వదినం

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర సోదరి అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పర్వదినాన్ని జరుపుకుంటారు. ప్రతియేటా శ్రావణ పౌర్ణమి నాడు ఈ వేడుకను నిర్వహించడం హిందూ సాంప్రదాయాల్లో అనాదిగా వస్తున్న పర్వదినం. రాఖీ పండుగ రోజున సోదరుడు సోదరికి రక్షగా ఉంటారని ఈ వేడుకను నిర్వహిస్తారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు రాఖీ పర్వదిన పండుగ విశిష్టతను రాజ్యంలో చాటింపు వేయించి తెలియజేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. స్వాతంత్ర్య కాలంలో స్వాతంత్ర్య సమరయోధులను ఏకతాటిపైకి తీసుకురావడంలో రక్షాబంధన్ వేడుక వేదికైనట్లు చరిత్ర చెబుతుంది. ప్రతియేటా రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సుదూర ప్రాంతాల నుండి సోదరి ఇంటికి వెళ్లి రాఖీని కట్టించుకొని పండుగను జరుపుకుంటారు. రాఖీలను సోదరుడికి సోదరి పంపి తనకు రక్షగా ఉండాలని వేడుకుంటారు. శ్రావణ పౌర్ణమి రోజున హైగ్రీవ స్వామి జయంతిని నిర్వహించడం జరుగుతుంది. ఈ రోజున బ్రాహ్మణులు నూతన యజ్ఞోపవితాన్ని ధరించి శ్రావణ పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాఖీ పండుగ పర్వదినాన లక్ష్మీనారాయణుడిని పూజించడం వల్ల ఆ ఇంట సకల శుభాలు చేకూరుతాయని భక్తులు విశ్వసిస్తారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఆలయాలతో పాటు లక్ష్మీనారాయణ ఆలయాల్లో ప్రత్యేక శ్రావణమాస పూజలు నిర్వహించనున్నారు.


రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

జోరుగా రాఖీల అమ్మకాలు

రాఖీ పండుగ పర్వదినాన సోదరుడికి సోదరి రాఖీని కట్టడం ఆనవాయితీగా వస్తుంది. రాఖీని కొనుగోలు చేసి సోదరుడికి కట్టాలనే ఉత్సాహంతో రాఖీలను మహిళలు జోరుగా కొనుగోలు చేశారు. ప్రధాన మార్కెట్‌తో పాటు వీధుల్లో ఉండే రాఖీ సెంటర్లు రద్దీగా మారాయి. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్, కుమార్‌గల్లి, వీక్లీ మార్కెట్, పెద్దబజార్, మల్టీప్లెక్స్ చౌరస్తా, హనుమాన్ జంక్షన్, హమాల్‌వాడి, గోల్ హనుమాన్, దుబ్బ చౌరస్తా, తదితర ప్రాంతాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగాయి.

ఆలూర్ ఫ్రీ హైస్కూల్‌లో..

ఆలూర్ : మండలంలో ఫ్రీ హైస్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ పండుగను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ఫ్రీహైస్కూల్‌లో భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు విద్యార్థులకు తెలిసేలా ప్రతీ పండుగను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని వివేకానంద పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులలో సోదర సోదరీమణి భావం, కులమత భేదం లేకుండా విద్యార్థుల్లో ఐక్యత భావం కోసం సమాజం పట్ల మనమంతా ఒక్కటే కుటుంబం అనే భావం పెంపొందించడానికి సంస్కృతి తెలియజేయడానికి రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలు, ఉపాధ్యక్షుడు అజయ్, మనోజ్, నాయకులు మహర్షి, అజేందర్, తదితరులు పాల్గొన్నారు.


బాల్కొండ పాఠశాలలో రక్షా బంధన్ వేడుకలు జరుపుకొంటున్న విద్యార్థులు


రక్షాబంధన్‌లో విద్యార్థినులు రాఖీలు కడుతున్న దృశ్యం


రాఖీ కట్టుకుంటున్న చిన్నారులు

కోనాపూర్ రహదారి విస్తరణ పనులు చేపట్టేదెన్నడో?

▸▸ ఇరు జిల్లాల ప్రజలకు బురదలో ప్రయాణాలు తప్పేదెన్నడో?


కోనాపూర్ గ్రామ శివారులో రహదారిపై బురదలో కూరుకుపోయిన ఆటో

కమ్మర్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జగిత్యాల రెండు జిల్లాను కలిపి ప్రధాన రహదారి బురద మయంగా మారి రెండు జిల్లా సమీప గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారి అష్టకష్టాలు పడుతన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ నుంచి జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషన్ రావుపేట్ గ్రామాలను కలిపే ప్రధాన రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా మిగిలి పోవడంతో రెండు గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోపూనార్ గ్రామస్థులు పొరుగు గ్రామాలు (జగిత్యాల జిల్లా) కోరుట్ల, ఖతలాపూర్, భూషణ్‌రావుపేట్‌కు వెళ్లాలన్నా చివరకు తమ వంట పోలాలకు వెలన్న ఈ రహదారిపై సాహసోపేత ప్రయాణాలు తప్పడం లేదు. మండంలోని నర్సాపూర్ గ్రామం నుంచి వయా ఇనాయత్ నగర్, కోనాపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం నాన్ ప్లానింగ్ పథకం లో రూ.3 కోట్ల 16 లక్షలు, నర్సాపూర్ గ్రామం నుంచి వయా ఇనాయత్‌నగర్, కోనాపూర్ గ్రామం మీదుగా జగిత్యాల జిల్లా భూషణ్‌రావుపేట్ గ్రామం వరకు డబుల్ రోడ్డు నిమిత్తం ఎస్సీ ఎస్డీఎఫ్ నిధుల నుంచి 65 కోట్ల 20 లక్షల రూపాయలను అప్పటి రోడ్లు భవనాలశాఖ మంత్రి (ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే) ప్రశాంత్ రెడ్డి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులకు 13 జూలై 2023 లో శంకుస్థానలు చేశారు. కాని రహదారి బాగులేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మిగులు పనులకు తగు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ

జుక్కల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం చిన్నగుల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-2 అధికారి సుధాకర్‌కు జిల్లా పంచాయతీ అధికారి మెమో జారీ చేసినట్లు జుక్కల్ ఎంపీవో రాము తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విధులకు డుమ్మా కొడుతూ పంచాయతీ సిబ్బందిచే ఫేస్ రికగ్నిషన్ సిబ్బంది నమోదు చేయడంతో ఉన్నతాధికారులు గమనించి సదరు పంచాయతీ కార్యదర్శి మెమో జారీ చేశారు.

చిలుకూరి బాలాజీ దర్శనానికి ఆర్టీసీ బస్సు

బాన్సువాడ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న బాన్సువాడ నుంచి చిలుకూరి బాలాజీ దర్శనానికి ఆర్టీసీ తీర్థయాత్ర బస్సు బయలు దేర నుందని డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. ఈ బస్సు బాన్సువాడ నుంచి ఉదయం 5.30నిలకు బయలుదేరి చిలుకూరి బాలాజీ దర్శనం పూర్తి చేసుకుని, అక్కడి నుంచి వికారాబాద్ అనంతపద్మనాభస్వామి దర్శనం, అనంతగిరి హిల్స్ చూసుకుని రాత్రి 12 గంటలకు తిరిగి బాన్సువాడకు చేరుకుంటుందని ఆమె తెలిపారు. రిజర్వేషన్ కోసం 90634 08477 గోపికృష్ణను సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం

పిట్లం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం ఏర్పాటు చేసినట్టు మండల అధ్యక్షుడు హన్మండ్లు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ హాజరు కానున్నట్టు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

నిజాంసాగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేసి మార్కింగ్ చేసి ముగ్గు పోశారు. ఈ గ్రామానికి 28 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 10 ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో 10 ఇళ్ల పనులు ప్రగతిలో ఉన్నాయని ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ అంజయ్య, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు ఉన్నారు.

మంజూరైన ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

తాడ్వాయి: మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. ఈయన శుక్రవారం మండలంలోని కరడ్‌పల్లి, కన్కల్, తాడ్వాయి గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఒకవేళ నిర్మించకుంటే మళ్లీ సాంక్షన్ రాదని అన్నారు. లబ్ధిదారులకు వచ్చే బిల్లులు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.




టీ స్టాల్ యజమానిని సన్మానం చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దు

● జ్యూట్ బ్యాగులు వాడే వారికి పువ్వులతో అభినందన

ఎల్లారెడ్డి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ప్రజలు ప్లాస్టిక్ వాడకూడదు అని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో వివిధ వార్డులలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి విలువ ఉన్న నీరును పారబోసి మురికి కాలువలపై దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అనంతరం డైలీ మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడకూడదు అని ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వ్యాపారులకు వివరించారు. జూట్ బ్యాగులతో మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులకు పుష్పాలను ఇచ్చి అభినందించారు. టీ స్టాల్‌లో గాజు గ్లాసులు వాడుతున్న నిర్వాహకులకు సన్మానించి అతనిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో సాయన్న జన్మదిన వేడుక జరుపుతున్న దృశ్యం

ఎల్లారెడ్డిలో సాయన్న జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముదిరాజ్ సంఘం వద్ద ముదిరాజ్ కులస్తులు పండుగ సాయన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన త్యాగాలు జ్ఞాపకాలు యువతకు స్ఫూర్తి అని, 150 ఏళ్ల క్రితం నిజాం నిరంకుశ పాలనలో నిర్భయ పోరాటం చేసిన వీరుడు అన్నారు. హైదరాబాద్ మినీ ట్యాంక్ బండ్‌పై పండుగ సాయన్న విగ్రహాన్ని ప్రతిష్టించాలని, అదేవిధంగా జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ప్యాలాల రాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్, బొండ్ల సాయిలు, జనముల పోచయ్య, రాజు, కిరణ్, నీల రవి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థ సింహారెడ్డి

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఆర్డీవో

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆర్డీవో పార్థసింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేపట్టే విధంగా అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, జీపీ కార్యదర్శి సందీప్. గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



లింగంపేటలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

రామారెడ్డి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, అన్నారం, పోసానిపేట్, సింగిరాయిపల్లి, ఇసన్నపల్లి, గొల్లపల్లి, కన్నాపూర్ తదితర గ్రామాల్లో, తండాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని గ్రామాల్లో ఇళ్లల్లో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు వైద్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్: మండలంలోని నర్వ గ్రామంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించి తీరొక్క పూలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అందరూ బాగుండాలని వేడుకున్నట్లు మహిళలు తెలిపారు.

లింగంపేట: మండలంలో తెల్లవారు జామున మహిళలు ఆలయాలకు వెళ్లి సామూహికంగా వరలక్ష్మీ వత్రాల్లో పాల్గొని, పండ్లు నైవేద్యంగా పెట్టి హారతి ఇచ్చారు. ఇంట్లో అమ్మవారి కలశాన్ని ఏర్పరిచారు. లక్ష్మీదేవికి ప్రీతికరమైన స్తోత్రాలు, స్తుతులు పఠించారు. మండల కేంద్రంలోని శిశుమందిర్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర కల్యాణ మండపంలో మహిళలు సమూహిక వరలక్ష్మీ పూజలు చేశారు.

పెద్ద కొడప్‌గల్: వరలక్ష్మీ వ్రతాలను మండలంలో మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి లక్ష్మీ అమ్మవారి ఫొటోకు అలంకరణ చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తమ కుటుంబంపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు. పూజల అనంతరం తమకు తోచినంతగా అన్నదానంతో పాటు, ముత్తైదువులకు వాయినం ఇచ్చారు.

జుక్కల్: మండలంలో వివిధ గ్రామాల్లో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. మహిళలు లక్ష్మీ దేవత ఆకారంగా ఏర్పడే రాగి కళాశాలకు నూతన వస్త్రాలు అలంకరించి లక్ష్మీమాత గా అలంకరించారు. తీపి నైవేద్యా లు, అరటి, మామిడి కొమ్మలతో వరలక్ష్మీ పూజలు ఘనంగా జరిగాయి.

బాన్సువాడ టౌన్: పట్టణంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఇళ్లలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పిండి వంటకాలతో లక్ష్మీమాతకు నైవేద్యం నివేదన చేశారు. ఇరుగుపొరుగు మహిళలను పిలుచుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. వరలక్ష్మీదేవి రావమ్మా- వరాలు ఇచ్చి పోవమ్మ అంటూ మహిళలు పాటలు పాడుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. శ్రావణ మాసంలో ప్రత్యేకంగా నిర్వహించే పండుగలలో వరలక్ష్మీ వ్రతం ప్రత్యేకమైంది. మండల కేంద్రంలోని గంగిశెట్టి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు మహిళల చేత ప్రత్యేక పూజలు చేయించారు. తమ సౌభాగ్యం కాపాడి, కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని మహిళలు కోరుకున్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల మహిళలు శుక్రవారం వరలక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.



భిక్కనూరులో..



జుక్కల్‌లో..



మద్నూర్‌లో..



నసురుల్లాబాద్‌లో..

సోదర ప్రేమకు ప్రతీక రక్షాబంధన్



భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో చెట్టుకు రాఖీ కడుతున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ అన్నారు. శుక్రవారం రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సౌత్ క్యాంపస్‌లో వృక్షాలకు, మొక్కలకు అధ్యాపకులు, విద్యార్థులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నా చెల్లెళ్లు ఒకరినొకరు రక్షణగా ఉంటామని ఆప్యాయాలతో జరుపుకునే రక్షాబంధన్ సందర్భంగా అదే ఆప్యాయతతో వృక్షాలను రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

కామారెడ్డి టౌన్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డికి తన నివాసంలో బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సాయిబాబా, జూలూరి సుధాకర్, రంగా రమేష్, అనిల్, బ్రహ్మకుమారీలు గంగా, కవిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డితో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగాయి. కొనుగోలుదారులకు అనుకూలంగా రూపాయి మొదలుకొని రూ.1000ల వరకు రాఖీల ధరలు ఉన్నాయి. కొనుగోలు దారుల అవసరాలను బట్టి రకరకాల వెరైటీలు గల రాఖీలు వ్యాపారులు అందుబాటులో ఉంచారు. ఎక్కువగా మహిళలే రాఖీలను కొనుగోలు చేసి తమ ఆత్మీయ సోదరులకు, నేస్తాలకు రాఖీ పండుగ రోజు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను వ్యక్తం చేస్తారు.

బాన్సువాడ టౌన్: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. రిపుల్స్ పాఠశాల విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కడుతూ నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష, మనిద్దరం దేశానికి రక్ష అంటూ పండుగ సంబరాలు జరుపుకున్నారు. అంతేకాకుండా చెట్లకు రాఖీ కడుతూ వృక్షాబంధన్ జరుపుకున్నారు. విద్యార్థులు చెట్లు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.



చంద్రశేఖర్‌రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



బాన్సువాడలో వృక్షానికి రాఖీ కడుతున్న విద్యార్థులు



బాన్సువాడలోని రిపుల్స్ పాఠశాలలో..



లింగంపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

సైబర్ నేరాలు డ్రగ్స్‌పై అవగాహన

లింగంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం సైబర్ నేరాలు, డ్రగ్స్, దొంగతనాలు, షీ టీమ్స్‌పై ఎస్సై దీపక్‌కుమార్ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని వీటి ద్వారానే సైబర్ నేరాలు జరుగుతాయని ఎస్సై తెలిపారు. యువత ఇటీవల డ్రగ్స్‌కు అలవాటు పడి నేరప్రవృతికి గురవుతున్నారని డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. దొంగలు ఇటీవల ఇంటికి తాళం వేసిన ఇంటినే ఎంపిక చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా తీర్థయాత్రలు, బంధువుల ఇళ్లకు రోజుల తరబడి వెళ్లితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం ఇన్‌చార్జీ తిరుపతి, శేషారావులతో పాటు కానిస్టేబుల్ రాజు ఉన్నారు.



చెట్ల పొదల్లో రహదారి సూచిక

సూచిక ఇలా.. గ్రామం పేరు కనబడేదెలా!

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పిట్లం నుంచి పెద్ద కొడప్‌గల్ గ్రామం వరకు 161వ జాతీయ రహదారి సాగుతోంది. ఈ రహదారి నుండి ఇతర గ్రామాలకు సర్వీసు రహదారిని అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు గానే ఆయా గ్రామాలకు వెల్లే రహదారుల వద్ద ఆ గ్రామం పేరు సూచిస్తూ సూచికలు ఏర్పాటు చేశారు. ఈ విధంగానే పెద్ద కొడప్‌గల్ గ్రామం దగ్గర అధికారులు సూచికను ఏర్పాటు చేయగా ఆ సూచికపై చెట్ల కొమ్మలు పెరిగి సూచిక ఏర్పడకుండ పోయింది. దీంతో ఇతర గ్రామాల నుండి వచ్చే వారికి ఈ సూచిక సరిగ్గా కనబడక ఇబ్బందులు ఎదురౌతున్నాయి. హైవే అధికారులు స్పందించి సూచికపై పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఎంబ్రాయిడరీ మిషన్‌ను అందిస్తున్న అదనపు కలెక్టర్

ఎంబ్రాయిడరీ మిషన్ అందజేత

కామారెడ్డి టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పీపుల్ ఫర్ ఇండియా స్వచ్ఛంద సంస్థకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ ఎంబ్రాయిడరీ మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గర్గుల్ గ్రామంలో రూ.3లక్షల 80 వేల విలువ గల ఎంబ్రాయిడరీ మిషన్, సబ్సిడీతో రూ.50వేల విలువ కలిగిన రైతులకు టార్పాలిన్‌లను అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ ప్రమీల, రోటరీక్లబ్ ఆఫ్ కామారెడ్డి అధ్యక్షుడు శంకర్, సెక్రటరీ సబ్బని కృష్ణహరి, ప్రోగ్రామ్ చైర్మన్ రాజనర్సింహారెడ్డి, ట్రెజరర్ రమణకుమార్, పీఫ్ఐ మెంబర్ అరవింద్,ఎంఈవో యోసప్, రోటరీ మెంబర్స్ శ్రీశైలం, సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఏపీఎస్, ఎఫ్‌పీవోలకు సభ్యత్వ నమోదుపై అవగాహన

సుభాష్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్, ఎఫ్‌పీవోలకు సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా డీసీసీబీ సహకారంతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సహకార అధికారి ఎం.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బుక్య వెంకన్న సభ్యులకు ఎఫ్‌పీవోలో చేరేందుకు ఆకర్షణీయమైన వాతావరణం సృష్టించడం, సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక సుస్థిరత, స్వయం బాధ్యత, పంట ఉత్పత్తులను మార్కెట్ డిమాండ్ ఉన్న ప్రదేశాలలో విక్రయించడం ద్వారా ఆదాయం పొందే వ్యూహాలను వివరించారు. అనంతరం ఎన్‌సీడీసీ ప్రతినిధి అక్తర్ మాట్లాడుతూ ఎఫ్‌పీవోల ద్వారా పంట ఉత్పత్తి, మార్కెట్ లాభాలు, వనరుల సద్వినియోగం, వ్యాపార అభివృద్ధి, ప్రణాళిక సామర్థ్యం, ఆన్‌లైన్ పోర్టల్ నమోదు మొదలైన అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార సిబ్బంది, సంఘాల పాలకవర్గ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు



బీర్కూర్‌లో ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

బీర్కూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్‌ను కట్ చేశారు. అనంతరం అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బసవ రాజు పటేల్, అహ్మద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌షెట్కార్ జన్మదినం వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, నాయకులు రాంరెడ్డి, మోహన్ రెడ్డి, విండో చైర్మెన్ శపథంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూరత్‌రెడ్డి, చంద్రశేఖర్, ఇమ్మురోజ్, బోడ్లరాజు, దయానంద్, నజీర్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో చైర్‌పర్సన్ మారెడ్డి రజిత జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సొసైటీ చైర్మన్ బొండ్ల సాయిలు, మాజీ జడ్పీటీసీ సామెల్, వెల్లుట్ల సంతోష్ కుమార్, సుఖేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - సార్ మేడమ్
ప్రియా 70 - హరిహర వీరమల్లు
ప్రియా 35 - మహావతర్ నరసింహ

బాన్సువాడ

మహేశ్వరి - కింగ్‌డమ్
వెంకటేశ్వర - మహావతార్ నరసింహా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

